# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-02-2026　　　　సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- సంపదతో పాటు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

- శాసనసభలో ఈ నెల 14న రాష్ట్ర బడ్జెట్ ను ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్నారు.

- ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును ఈ ఏడాది జూన్ 30 వరకూ పొడిగిస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

- రైతులకు అవసరమైన పరిశోధనలు విస్తృతంగా చేస్తున్నామని ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి శారదా జయలక్ష్మి తెలిపారు.

=======================

సంపదతో పాటు.. ఆరోగ్యకరమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఈ రోజు ప్రసంగించారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన ధ్యేయంగా సమగ్రమైన కార్యాచరణతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం సమతూకంగా పరిపాలన సాగుతోందని తెలిపారు. ఏడాదికి 33 వేల కోట్ల రూపాయాలతో సంక్షేమ పథకాలను, నగదు బదిలీ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో ఫ్యామిలీ కార్డును ప్రభుత్వం అందించేందుకు ప్రయత్నాలు చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రం ఐటీ, క్వాంటం కంప్యూటింగ్ రంగాలలో అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. సాంకేతికతను అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్‌లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

=======================

రాష్ట్ర శాసన సభ సమావేశాలు మార్చి 7వ తేదీ వరకూ నిర్వహించాలని బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్ణయించింది. శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన అసెంబ్లీ ఆవరణలో ఈ రోజు జరిగిన సమావేశంలో 17 పని దినాలుగా అసెంబ్లీని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 14న రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని సమావేశం తీర్మానించింది. ఈ నెల 17, 18 తేదీలలో బడ్జెట్ పై పూర్తి స్థాయి చర్చ జరపాలని నిర్ణయించారు. ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడంతో పాటు.. 10 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

=======================

రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో నివాసాలు ఏర్పరచుకున్న ఆక్రమణల క్రమబద్దీకరణ దరఖాస్తుల గడువును ఈ ఏడాది జూన్ 30 వరకూ పొడిగిస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా భూముల బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో APSDC కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 1,500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం NREDCAPకి కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

=======================

రాష్ట్రంలో మరో 15 సంవత్సరాల పాటు ఎన్డీఏ కూటమి పాలన కొనసాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. గత 20 నెలలలో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు ఏర్పడలేదని గుర్తు చేశారు. ఇదే ఐక్యత.. ఇకపైనా కొనసాగాలని, అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అసెంబ్లీ కమిటీ హాలులో ఎన్డీఏ శాసనసభా పక్ష ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులతో సమావేశాన్ని ముఖ్యమంత్రి ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ నిబద్ధతో పని చేయాలని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతిపథం వైపుగా సాగుతోందని చెప్పారు.

=======================

వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు మంజూరు చేసిన సుమారు 40 కోట్ల రూపాయల నిధులను మార్చి నెలాఖరులోగా పూర్తిగా వినియోగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టరేట్ లో సమావేశాన్ని ఆయన ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, రాష్ట్రీయ కృషి వికాష్ యోజన, మిషన్ వాత్సల్య తదితర పథకాల అమలుకు జిల్లాకు మంజూరు చేసిన నిధులను ఖర్చు చేయాలని కోరారు.

విరామం

=======================

ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతులకు అవసరమైన పరిశోధనలు పెద్ద ఎత్తున చేస్తున్నామని ఉపకులపతి శారదా జయలక్ష్మి తెలిపారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రేపు నిర్వహించనున్న కిసాన్ మేళా కార్యక్రమం సందర్భంగా ఆమె ఈరోజు స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ... మారుతున్న వాతావరణ పరిస్థితులు, పంటలను ఆశిస్తున్న చీడపీడలను తట్టుకునే విధంగా నూతన వంగడాలను ఆవిష్కరించడంలో పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, కృత్రిమ మేధ వినియోగాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 19 సెకన్లు)

=======================

తహశీల్దార్లు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పని సరిగా చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుండి తహశీల్దార్లతో దృశ్య మాధ్యమం ద్వారా ఈ రోజు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లోని ప్రభుత్వ భూముల పరిస్థితిని పరిశీలించాలని, అన్యాక్రాంతం కాకుండా వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవిన్యూ శాఖకు సంబంధించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. మ్యూటేషను ధరఖాస్తు సమయంలోనే అర్జీదారునికి కావలసిన సమాచారం అందించి, సక్రమంగా ధరఖాస్తు చేయించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు కొత్త ఓటర్లు నమోదుతో పాటుగా.. మరణించిన, వలసవెళ్లిన వారి ఓట్లు తొలగింపు చేసి సమగ్రమైన ఓటరు జాబితా తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

=======================

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి. యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏటీడబ్ల్యూఓలు, హెడ్ మాస్టర్లు, వార్డెన్లతో సమీక్షా సమావేశాన్ని ఆయన ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ఆరోగ్య సమాచారాన్ని హెచ్.టి.టీ.ఎస్ యాప్‌లో ప్రతిరోజూ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.  పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు రావాలని యశ్వంత్ కుమార్ రెడ్డి కోరారు.

=======================

దైనందిన ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ రాకుండా చూసుకోగలమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాంజీ అన్నారు. మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ల ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సును ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ వంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు.

=======================

విశాఖ నగరంలో జరగనున్న ఐఎఫ్ఆర్–2026 ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈ రోజు పరిశీలించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జీవీఎంసీ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్.. వివిధ అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలు అంతా ఈ కార్యక్రమాలను వీక్షించేలా  ప్రత్యేక ఎన్‌క్లోజర్లు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

=======================

పశ్చిమ గోదావరి జిల్లాలోని పెట్రోల్ బంక్ యజమానులు ప్రభుత్వ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భీమవరం మండలం, యనమదుర్రు గ్రామంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ ను ఆయన ఈ రోజు ఆకస్మిక తనిఖీ చేసి ఇంధన నాణ్యత, కొలతలు, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారుల సేవలను పరిశీలించారు.

=======================
=======================